# హమాలీ కార్మికుల సేవలు అనిర్వచనీయం

**హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

**మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్**



హనుమకొండ, వాయిస్ టుడే: తమ రక్తాన్ని చమట చుక్కలుగా మార్చుకుని రాత్రింబగళ్ళు సమాజానికి నిత్యావసర వస్తువులను సరఫరా చేస్తున్న హమాలీ కార్మికుల సేవలు అనిర్వచనీయం అని మాజీ ఛీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ(బీఆర్ఎస్) హనుమకొండ జిల్లా కార్యాలయంలో కాకతీయ హమాలీ సంఘం కార్మికులతో వినయ్ భాస్కర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల సరఫరాలో హమాలీ కార్మికులు కీలక భూమిక పోషిస్తారు అని అన్నారు. హమాలీల శారీరక శ్రమతోనే ప్రజలందరికీ వస్తువులు అందుతున్నాయని వినయ్ భాస్కర్ వివరించారు. హమాలీల శ్రమ తగ్గ వేతనాలు అందడం లేదని, హమాలీలు అసంఘటితమై ఉన్నారని అన్నారు. వారు సంఘటితం అయ్యేందుకు కృషి చేస్తానని వినయ్ భాస్కర్ హామీ ఇచ్చారు. హమాలీలను కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకొచ్చి, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్‌లు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. హమాలీ అడ్డాల వద్ద మున్సిపల్ అధికారులు కనీస వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వ్యాపార సంస్థల యాజమాన్యాలు కూలీ తక్కువ ఇస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని హమాలీలు తమ సమస్యలను వినయ్ భాస్కర్ దృష్టికి తీసుకొచ్చారు. హమాలీల గోడు ను విన్న వినయ్ భాస్కర్ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమ అనంతరం కాకతీయ హమాలీ సంఘం సభ్యులను వినయ్ భాస్కర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హమాలీ సంఘం అధ్యక్షులు లింగన్న, ఉపాధ్యక్షులు సి. హెచ్ కుమార్, ఎల్.కుమార్, జి.సదయ్య, ఆర్. శ్రీను, సభ్యులు ఎన్.శంకర్, ఎన్.రాజేష్, వి.రవి, దామెర సమ్మయ్య పాల్గొన్నారు.



## సప్లమెంటరీ పరీక్షలో ప్రతి ఒక్కరు పాస్ కావాలి

వాయిస్ టుడే తొర్రూరు మే 2: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగిల్, డబుల్, త్రిపుల్ సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపించి అందరూ సప్లమెంటరీ పరీక్షలో పాసే విధంగా చొరవ తీసుకోవాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్య రాష్ట్ర పరిశీలకులు టి.యాదగిరి కోరారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం డిఐఓ మాధర్ గౌడ్ తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సింగిల్,డబుల్, త్రిపుల్ సబ్జెక్ట్ ఫెయిల్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాలలో అధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు స్వీట్ తినిపించి శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.నారాయణ,అధ్యాపకులు సువర్ణ,ఉప్పలయ్య,అన్నపూర్ణ, నర్సయ్య,మల్లయ్య,శివరామకృష్ణ, అనిత, రాజేష్, నాగరాజ్, కమల్దీప్, అలీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సారయ్యకు ఘన నివాళి

**తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి**

వాయిస్ టుడే తొర్రూరు మే 2: పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వి రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి తొర్రూర్ మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఇటీవల మృతిచెందిన యనమల సారయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ల నరేందర్ రెడ్డి, బీజాల వరప్రసాద్, చర్లపాలెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,గోపాలగిరి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మణ్, మహేందర్, రవి, దర్గయ్య, యాకన్న, చిట్టి మల్ల, మహేష్, యనమల రాకేష్, యనమల అంజయ్య, యనమల శ్రీనివాస్, గోపాలగిరి సోషల్ మీడియా కోఆర్డినేటర్ కార్తీక్, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎద్దు మహేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు ఏసీ బస్సు సర్వీస్ ప్రారంభం

వాయిస్ టుడే తొర్రూర్ మే 2 : తొర్రూరు డిపో పరిధిలో ఉన్న ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు తెలియజేయునది ఏమనగా! తేదీ:03-05-2025 రోజున ఉదయం 9 గంటలకు మన తొర్రూర్ డిపో బస్టాండ్ ఆవరణంలో గౌరవనీయులైన యశస్విని రెడ్డి స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా డిపో మేనేజర్ వి. పద్మావతి ఆధ్వర్యంలో రాజధాని ఏ.సీ సర్వీసు ప్రారంభోత్సవం చేయడం జరుగుతుంది. కావున తామెల్లరు హాజరు కావాలని కోరారు.



## సాఫ్ట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ ప్రారంభం

కాజీపేట, వాయిస్ టుడే: హనుమకొండ జిల్లాలోనీ ఐనవోలు మండలంలో గల ఒంటిమామిడిపల్లిలో జిల్లా క్రీడా అధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సాఫ్ట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఈనెల 1వ తేదీన గురువారం ప్రారంభమయ్యాయి. ఒంటి మామిడిపల్లిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడామైదానంలో కొనసాగుతున్న సాఫ్ట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సదానందం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.నవీన్, వైస్ చైర్మన్ జి.రాజు, కమిటీ మెంబర్స్ ఆనందం, కరుణాకర్, ఇబ్రహీం, రాజ్ కుమార్, సదానందం, రఫీ, రవీందర్, రాజు, ఉపాధ్యాయులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు సాఫ్ట్ బాల్ కోచ్ గా వ్యవహరిస్తున్న తాబేటి నాగరాజును వేసవి శిక్షణ శిబిర నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాఫ్ట్ బాల్ క్రీడలో జాతీయస్థాయికి ఎదిగిన వారికి అనేకమందికి ఉద్యోగాలు లభించాయని.. విద్యా, ఉద్యోగాల్లో అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని నాగరాజు వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సందర్శించిన వారికి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్ బాల్ క్రీడలో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగేలా నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. అనంతరం కోచ్ నాగరాజ్ మాట్లాడుతూ ఒంటిమామిడిపల్లికి సాఫ్ట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా క్రీడా అధికారి సంస్థ అధికారి అశోక్ కు, ప్రధానోపాధ్యాయులు ఎం.సదానందం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నవీన్, ఇతర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా కార్మిక దినోత్సవం



కాజీపేట,వాయిస్ టుడే: మే1 కార్మిక దినోత్సవం సందర్భంగా కాజీపేట ఏఆర్ఆర్ కాలనీలో సిపిఐ కాజీపేట శాఖ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ మాట్లాడుతూ కార్మికులు లేకపోతే సమాజం స్తంభించిపోతుందని అన్నారు. అలాంటి కార్మికులకు మనం సహాయసహకారాలు అందించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసునూరి మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గబ్బెట శ్రీనివాస్, సిపిఐ మండల నాయకులు రామంచ సారంగపాణి, ఎంఆర్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రేణూకుంట్ల ఉమామహేష్, పొడిశెట్టి విజయ్, పోగుల రాకేష్, శంకర్, స్వామి, స్వరూప, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గంలో ఎంపీ రఘురాం రెడ్డి సుడిగాలి పర్యటన



సత్తుపల్లి, మే 2 ( వాయిస్ టుడే ): సత్తుపల్లి నియోజకవర్గంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం, విస్తృతంగా పర్యటించారు. తొలుత పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామంలో రూ. 9లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ఆ తర్వాత సత్తుపల్లి లోని జేవీఆర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. అక్కడ రూ. 37 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**రూ. 95 లక్షల రూసా ఫండ్ పత్రం అందజేత**

సత్తుపల్లి లోని జేవీఆర్ కళాశాల అభివృద్ధి కోసం మంజూరైన రూసా ఫండ్ నిధులు రూ. 95 లక్షల మంజూరు పత్రాన్ని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. గోపి, అధ్యాపక బృందానికి అందజేశారు. ఒక ప్రణాళిక ప్రకారం ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ తర్వాత ఎన్ సీసీ విద్యార్థులతో ఎంపీ మాట్లాడి అభినందించారు. ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ సీనియర్ నాయకులు మట్టా దయానంద్, మండలాల బాధ్యులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు రాని ఆడపిల్లలకు వివాహం చేయరాదు

ముదిగొండ మండలం మే 2 వాయిస్ టుడే : ముదిగొండ మండలం పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో 18 సంవత్సరాలు రాని ఆడపిల్లలకు వివాహం చేయరాదని ఆడపిల్లలు చదువుకి మాత్రమే అంకితం అవ్వాలని వృద్ధులు ఐడి కార్డు తీసుకోవాలని మహిళలకు తగు సూచనలు చేసిన జిల్లా సమన్వయకర్త (డిఎమ్ సీ) సయ్యద్ సమీన్ అన్నారు న్యూ లక్ష్మీపురం గ్రామంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత నిపుణులు కే.సతీష్,గ్రామ పెద్దలు కనకం ముత్తయ్య, రాణి,గ్రామ పంచాయితీ సిబ్బంది పల్లెపొంగు రవి తదితరులు పాల్గొన్నారు.



## సత్తా చాటిన ఆక్స్ ఫర్డ్ స్కూల్ విద్యార్థులు

ఖమ్మం, మే 2 ( వాయిస్ టుడే): స్థానిక స్టేషన్ రోడ్ లోని ఆక్స్ ఫర్డ్ హైస్కూల్లో పదిలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఆక్స్ ఫర్డ్ హైస్కూల్లో ప్రిన్సిపాల్ ప్రిన్సిపల్ జాపర్ అలీ మతీన్ , మరియు వైస్ ప్రిన్సిపాల్ సిద్ధిఖ అజీజ్ తెలిపారు . సాయి మణికంఠ 584 , విగ్నేష్ 580, రిమ్మ మేహవిష్ 565 , దీప్తిక 563, అనస్ 559, సంజన 557, నియ రోస్ 553 మార్కులు సాధించారని, తమ పాఠశాల పదవ తరగతి ఫలితాలలో 43 మంది విద్యార్థులకు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించారని తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించారు .ద




## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి శాంతి చర్చలు జరపాలని మానవహారం

ఖమ్మం, మే 2 ( వాయిస్ టుడే) : అఖిలపక్ష రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక హక్కుల సంఘాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించడం జరిగింది. మధ్య భారత దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీ లపై జరుగుతున్న నరమేధాన్ని వెంటనే ఆపివేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేస్తూ ఈరోజు జడ్పీ సెంటర్ (అంబేద్కర్ చౌరస్తా) వద్ద మానవహారం నిర్వహించడం జరిగింది. దీనికి కాకి భాస్కర్, రవి మారుత్ నిర్వాహకులుగా వ్యవహరించగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాస్ లైన్ జిల్లాకార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు, తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి చిర్ర రవి,సేవాలాల్ సేన అధ్యక్షులు కిషన్ నాయక్,ఆమ్ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్,డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. అడవిలో ఉన్నటువంటి ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పెట్టుబడి దారులకు ఆదాని, అంబానీ లకు వాళ్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పారా మిలిటరీ బలగాలు, గ్రేహౌండ్స్ దళాలు, సిఆర్పిఎఫ్, బస్తర్ ఫైటర్స్ సి- 60 కమాండోలు సంయుక్తంగా ఆదివాసులపై దాడులు చేస్తూ అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ బార్డర్ లో లేదా బంగ్లాదేశ్,చైనా సరిహద్దుల్లో ఉండాల్సినటువంటి బలగాలని ఈ దేశ పౌరులైనటువంటి ఆదివాసుల పైన దాడులు చేయడం దుర్మార్గమన్నారు. మావోయిస్టు ముక్తభారత్ అని మాట్లాడుతూ మావోయిస్టులను తుద ముట్టించడమే మా లక్ష్యం అని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడడం ప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజల పైన నరమేధాన్ని ప్రదర్శిస్తున్నా రన్నారు. ఈ దేశ ప్రజలైనటువంటి ఆదివాసులను నిర్బంధంగా అణిచివేయడం సహించరానిదని దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మన్నారు. మరొక ప్రక్క కాల్పుల విరమణ పాటించండి అని మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేసినప్పటికీ నేటికీ కనీస స్పందన లేకపోవడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు.మరొకపక్క మేధావులు,రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ స్పందించకపోవడం సరైన విధానం కాదని అన్నారు. ఆదివాసులపై కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి కేంద్ర బలగాలని వెనక్కి పంపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే విధంగా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా భద్రకాళి భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం

**పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

హనుమకొండ, వాయిస్ టుడే:: వరంగల్ భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి అమ్మవారు, భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం శుక్రవారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళి అమ్మవారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. భద్రకాళి, భద్రేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవం పురస్కరించుకొని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని భక్తులతో కలిసి వారు తిలకించారు. వేద పండితులు అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. భద్రకాళి దేవస్థానంలో భద్రకాళి అమ్మ వారి కళ్యాణోత్సవంలో పుర ప్రముఖులతో పాటు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతుల దగ్గర ఉండి లారీల్లో వరి ధాన్యాన్ని తరలిస్తున్న తహాశీల్దార్

ముదిగొండ మండలం మే 2 వాయిస్ టుడే : గోకినేపల్లిలో రైతుల దగ్గర ఉండి లారీల్లో వరి ధాన్యాన్ని తరలిస్తున్న తహశీల్దార్ సునీతా ఎలిజబెత్ ఈ సందర్భంగా తహశీల్దార్ రైతులతో మాట్లాడుతూ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు పండించిన వరిని తీసుకువచ్చి తూకం వేస్తున్నారు. అయితే, లారీలు సరిపడా లేకపోవడంతో ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోంది అని ఈ విషయం పై అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్ళినట్లు రెండు,మూడు రోజుల్లో మండల వ్యాప్తంగా ఉన్న ధాన్యాన్ని లారీలు ఏర్పాటు చేసి మిల్లులకు తరలిస్తామని అధికారులు ధాన్యం తరలింపును వేగవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు, మిల్లులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.